నమస్తే తెలంగాణ

# వికారాబాద్

13 | హైదరాబాద్, శుక్రవారం 1 మార్చి 2024 | VIKARABAD


## స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం..?

**పోటీ నుంచి తప్పుకొనేందుకు నలుగురు కార్పొరేటర్లు సిద్ధం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఎప్పటిలాగే ఈసారి కూడా ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల 20 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్ల దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. 15 మంది సభ్యులకు 19 దరఖాస్తులొచ్చాయి. బీఆర్ఎస్ నుంచి 10, ఎంఐఎం-7, కాంగ్రెస్ నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగానే గడిచిన రెండు రోజులుగా దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. శనివారంతో ఉపసంహరణ గడువు ముగియనున్నది. దీంతో కాంగ్రెస్ నుంచి వేసిన ఇద్దరు కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, రాజ్‌జితేంద్రనాథ్, బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్లు సబితాకిశోర్, లావణ్య నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 2న మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో 15 మంది ఉంటే.. ఎన్నిక ఏకగ్రీవమని అధికారులు ప్రకటించనున్నారు. పోటీలో 15 మంది కన్నా ఎక్కువ మంది నిలిస్తే ఈ నెల 7న జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుందన్నారు.

# నో టెన్షన్..!

**పరీక్షల మాసంలో ఉచిత కౌన్సెలింగ్**

**విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు సైకాలజిస్టుల సేవలు**

**సమస్య పంచుకో.. పరిష్కారం తెలుసుకో**

**ఉచిత కౌన్సెలింగ్ సేవలు ప్రారంభించిన తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్**



సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 ( నమస్తే తెలంగాణ ) : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. ఆందోళనకు గురై పరీక్ష రాయడంలో తడబడుతుంటారు. చదివింది గుర్తుండడం లేదని ఆందోళన చెందుతుంటారు. టెన్షన్‌తో నిద్ర సరిపడా లేక మరింత నీరసించిపోతుంటారు. ఇలాంటి పరిస్థితులతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతిని పరీక్ష శ్రద్ధగా రాయలేకపోతుంటారు. అలాంటి వారిలో మానసిక స్థైర్యం నింపేందుకు తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ముందుకొచ్చింది. మార్చి నెల పరీక్షల సమయం కావడంతో ఉచితంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ సేవలు ప్రారంభించారు. పరీక్షలకు సంబంధించి ఆందోళనకు గురయ్యే వాళ్లు సైకాలజిస్టులతో మాట్లాడితే మనసుకు ప్రశాంతత చేకూరుతుందని.. తద్వారా ఆత్మస్థైర్యం పెరిగి పరీక్ష బాగా రాయడానికి దోహదపడుతుందని అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మోత్కూరి రామచందర్ తెలిపారు.

**సేవలు అందించే వారి సమాచారం**

| | |
|---|---|
| డాక్టర్ రామచందర్ | 9533660938 |
| డాక్టర్ లావణ్య | 9908987770 |
| డాక్టర్ శ్రీపూజ | 9246155955 |
| ప్రతిమ | 9553484643 |
| విజయ | 7032226942 |
| శ్రీదేవి | 8374685999 |
| కీర్తి | 9550183838 |
| సునాయన | 8008231699 |
| సాహితి | 7993715081 |
| అశ్విని | 9032248100 |

## పార్లమెంట్ ఎన్నికలకు
# చురుగ్గా ఏర్పాట్లు..



- పూర్తైన ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ
- ఇప్పటికే ఓటరు తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఈసీఐఎల్ నుంచి వికారాబాద్ జిల్లాకు అదనంగా చేరిన 275 ఈవీఎంలు
- ఈవీఎంలపై కొనసాగుతున్న ఓటర్ల అవగాహన కార్యక్రమం
- కొనసాగుతున్న పీవో, ఏపీవోల వివరాల ఆన్‌లైన్ ఎంట్రీ
- జిల్లాలో ఓటర్లు 9,84,068 మంది



వికారాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం ఓటరు తుది జాబితాను విడుదల చేసింది. అలాగే ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ కూడా అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తైంది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి రానుండగా, కొడంగల్ నియోజకవర్గం మాత్రం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి వెళ్తుంది. ఆయా నియోజకవర్గాలకు సరిపడా ఈవీఎంలను సమకూర్చుతున్నారు. అలాగే పోలింగ్ నిర్వహణకు సిబ్బందిని నియమించేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే ప్రక్రియ కొనసాగుతున్నది. ఎన్నికల షెడ్యూలు రాగానే వారికి శిక్షణ ఇచ్చేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది.

### సాంకేతిక సమస్యలొస్తే..

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఈవీఎంలకు సంబంధించి ఏమైనా సాంకేతిక సమస్యలొస్తే వెంటనే వేరే వాటిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 1,133 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ అదనంగా సమకూర్చేందుకు ఈవీఎంలు తక్కువ అవుతుండడంతో ఈసీఐఎల్ నుంచి జిల్లాకు కొత్తగా 275 ఈవీఎంలు చేరుకున్నాయి. అలాగే జిల్లాలో బ్యాలెట్ యూనిట్లు-2267, కంట్రోల్ యూనిట్లు-1694 , వీవీ ప్యాట్లు-1791 ఉన్నాయి. ఈవీఎంలపై నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఓటు వేసే విధానంపై ప్రజలు, యువతకు అవగాహన కల్పిస్తున్నారు.

### నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు..

ఓటరు తుది జాబితాను ప్రకటించినా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసేవరకూ మీసేవా లేదా ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటరుగా అర్హులు నమోదు చేసుకోవచ్చు. అలాగే అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరిగిన దృష్ట్యా పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరుగుతుందని అంచనా వేసినప్పటికీ ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండాల్సిన ఓటర్ల సంఖ్యను 1400 నుంచి 1600లకు పెంచడంతో పోలింగ్ కేంద్రాలను పెంచాల్సిన అవసరం లేకుండా పోయిందని సంబంధిత అధికారులు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు.

### అభ్యర్థుల ఎంపికలో పార్టీలు బిజీ..

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ మార్చి రెండో వారంలో వచ్చే అవకాశమున్న నేపథ్యంలో ఆయా పార్టీలు అభ్యర్థుల ఎంపిక కసరత్తును మొదలుపెట్టాయి. చేవెళ్ల పార్లమెంట్ నియోజవర్గ పరిధిలో వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సెగ్మెంట్లున్నాయి. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఖరారు చేసింది. సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి మరోసారి బరిలోకి దిగనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి న వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి బరిలోకి దిగుతున్నట్లు సమాచారం. అయితే కోస్గి బహిరంగ సభలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. తాజాగా చేవెళ్లలో నిర్వహించిన సభలో మా త్రం పట్నం ఫ్యామిలీ నుంచి ప్రకటిస్తారని ఊహించినా అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. సునీతారెడ్డే బరిలోకి దింపుతారా.. లేదంటే ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న కేఎల్ఆర్‌కు అవకాశం అవుతుం దా అనేది తెలియాల్సి ఉన్నది. మరోవైపు భారతీయ జనతా పార్టీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును ఆ పార్టీ ఇప్పటికే ఖరారు చేయగా, అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నది.

**వికారాబాద్ జిల్లాలో 9,84,068 మంది ఓటర్లు..**

ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటరు తుది జాబితా ప్రకారం జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో మొత్తం 9,84,068 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 4,86,109 మంది, మహిళలు 4,97,920 మంది, ఇతరులు 39 మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా పరిగి సెగ్మెంట్‌లో 2,66,273 మంది ఓటర్లుండగా అందులో పురుషులు 1,33,625 మంది, మహిళలు 1,32,639 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. వికారాబాద్‌లో మొత్తం 2,31,679 మంది ఓటర్లుండగా.. అందులో పురుషులు 1,15,019 మంది, మహిళలు 1,16,647 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. తాండూరులో 2,43,849 మంది ఓటర్లుండగా, పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 2,42,267 మంది ఓటర్లుండగా, పురుషులు 1,19,237 మంది, మహిళలు1,23,020 మంది, ఇతరులు 10 మంది ఉన్నారు.

## ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



రంగారెడ్డి, ఫిబ్రవరి 29(నమస్తే తెలంగాణ) : ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి నోడల్ అధికారులు, డీఏవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో నియమావళిని కచ్చితంగా అమలు చేయాలన్నారు. శాసనసభ ఎన్నికల మాదిరిగానే కోడ్ వర్తిస్తుందని.. జిల్లాలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్టీ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారులు వారికి కేటాయించే పనులను సజావుగా నిర్వహించాలన్నారు. శాసనసభ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన ప్రాంతాల్లోని ప్రజలకు స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో 1500కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే సహాయక పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీలత, సీపీవో సౌమ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, డీఏవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పది విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని

# పదిలో పదిలంగా..

## నేటి నుంచి పదోతరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు

- వికారాబాద్ జిల్లాలో పరీక్షలు రాయనున్న 13,074 మంది విద్యార్థులు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 29 : పదోతరగతి వార్షిక పరీక్షలకు ముందు విద్యాశాఖ విద్యార్థులకు ప్రీ-ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నది. నేటి నుంచి జరుగనున్న ఎగ్జామ్స్‌తో విద్యార్థులు ఒత్తిడి లేకుండా రాసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. స్టూడెంట్స్ టెన్త్‌లో ఉత్తమ ఫలితా లు సాధించేందుకు గతేడాది డిసెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠ్యాంశాల నుంచి వచ్చే ప్రశ్నలు, ఛాయిస్ ఎలా ఉంటుంది, ప్రశ్నాపత్రం ఎలా ఉంటుం ది, ఏయే పాఠాలు చదివితే మంచి మార్కులు సాధించొచ్చనే సందేహాలకు విద్యార్థులు లోనవుతుంటారు. ప్రీ-ఫైనల్ పరీక్షలపై వారికి అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో విద్యాశాఖ వీటిని నిర్వహిస్తున్నది. గతేడాది వరకు పదోతరగతిలో ఆరు పేపర్లకు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నుంచి భౌతికశాస్త్రం, జీవశాస్త్రానికి వేర్వేరుగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇలా నిర్వహించడంతో విద్యార్థులకు కొంతవరకు ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నా రు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం ఆ సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులకు సన్నద్ధం అయ్యేందుకు సమయం ఇచ్చి మధ్యాహ్నం నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్న దృ ష్ట్యా ప్రీ-ఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం 1.45 నుంచి సాయంత్రం 4.45 వరకు మూడు గం టలపాటు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనున్నాయి.

### మండలాలకు చేరిన ప్రశ్నాపత్రాలు

పీ-ఫైనల్ పరీక్షలకు గతేడాది ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు పంపిన సెట్-2 ప్రశ్నా పత్రాలను వినియోగించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ ఆదేశాలతో గతేడాది ప్రశ్నాపత్రాలను భద్రపరిచిన చోట నుంచి ఇప్పటికే మండలాలకు ప్రీ-ఫైనల్ పరీక్షా ప్రశ్నాపత్రాలను ఎంఈవోలు తీసుకుని ఉన్నత పాఠశాలలకు చేరవేశారు. మార్చి 1 నుంచి 11 వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రీ-ఫైనల్ పరీక్షలకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

### ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

మార్చి 18 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఈ ఏడాది మంచి ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందుకోసం గతేడాది డిసెంబర్ నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షా విధానంపై ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు పూర్తిగా అవగాహన కల్పించారు. ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. ఈ ఏడాది వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి 13,074 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయనున్నారు. అలాగే పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ చర్య లు చేపట్టింది. గతంలో వార్షిక పరీక్షల్లో ప్రశ్నా పత్రాలు లీకేజీ కావడంతో అప్రమత్తమైన అధికారులు అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

# అమ్మో అనీమియా



- బాలికల్లో ఆందోళన కలిగిస్తున్న రక్తహీనత సమస్య

- రంగారెడ్డి జిల్లాలోని విద్యాసంస్థల్లో కొనసాగుతున్న పరీక్షలు
- ఇప్పటివరకు 32,107 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది
- ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న ప్రక్రియ

రంగారెడ్డి, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): బాలికల్లో తలెత్తుతున్న 'అనీమియా' సమస్య ఆందోళన కలిగిస్తున్నది. చిన్నతనం నుంచే సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో రక్తహీనత బారిన పడుతున్నారు. ఈ సమస్యను ఆరంభంలోనే గుర్తించి చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహించి బాధితులను గుర్తించి అవసరమైన మందులను అందిస్తున్నారు.

### ఇప్పటివరకు 32,107 మందికి పరీక్షలు

మారుతున్న ఆహార అలవాట్లతో నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. జాతీయ కుటుంబ సర్వే ప్రకారం దేశ జనాభాలో ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతుండగా.. వారిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నట్లు తేలింది. మొదటి దశలోనే ఈ వ్యాధిని అరికట్టాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో 14 బృందాలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థినులకు రక్త పరీక్షలను చేయిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 32,107మందికి పరీక్షలు నిర్వహించగా..466 మంది అనీమియా బారిన పడినట్లు గుర్తించారు. తీవ్రత ఎక్కువ ఉన్న వారిని జిల్లా ఆస్పత్రికి పంపి వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక దశలో ఉన్నవారికి అక్కడికక్కడే మందులను అందజేయడంతోపాటు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

### నాలుగు కేటగిరీలుగా నిర్ధారణ

శరీరంలో ఎర్ర రక్త కణాల సంఖ్య తక్కువగా ఉండడంతో రక్తహీనత ఏర్పడుతుంది. ఏ పని చేసినా త్వ రగా అలసిపోతారు. నిద్రలేమి, నీరసం, బరువు తగ్గ డం, ఎదుగుదల లోపం, పెదవులు తెల్లబడడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రక్తపరీక్షల్లో నాలుగు కేటగిరీలుగా రక్తహీనతను నిర్ధారిస్తున్నారు. సాధారణంగా 11-11.9 గ్రాముల మధ్య, అంతకంటే ఎక్కువ రక్తశాతం ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. అంతకన్నా తక్కువగా ఉంటే మైల్డ్ అనీమియా (మాధ్యమిక) స్థాయిగా నమోదు చేస్తున్నారు. 8-10.9 గ్రాములు ఉంటే మాడరేట్ (పరిమిత స్థాయి) అనీమియాగా గుర్తిస్తున్నారు. 8 గ్రాములోపు వారిని సీవియర్ (తీవ్రత) అనీమియాగా గుర్తిస్తున్నారు. మైల్డ్ అనీమియా, మాడరేట్ అనీమియాగా గుర్తించిన వారికి పోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేసి వాడాలని సూచిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. రక్తహీనతతో బాధపడే వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రావని వైద్యులు చెబుతున్నారు.

# తొలి రోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు
- వికారాబాద్ జిల్లాలో 7,849 మంది విద్యార్థులకు 7,697 మంది హాజరు

వికారాబాద్, ఫిబ్రవరి 29 : ఇంటర్ రెండో ఏడాది వార్షిక పరీక్షలు వికారాబాద్ జిల్లాలో తొలిరోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 29 పరీక్షా కేంద్రాల్లో 7,849 మంది విద్యార్థులకుగాను 7,697 మంది స్టూడెంట్స్ హాజరు కాగా 152 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు కొందరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జనరల్‌లో 6,602 మంది ఉండగా 6,489 మంది విద్యార్థులు హాజరు కాగా 113 మంది గైర్హాజరయ్యారు. ఒకేషన్‌లో 1,247 మందికిగానూ 1,208 మంది విద్యార్థులు పరీక్షను రాశారు. ఎలాంటి మాల్ ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండడంతోపాటు కేంద్రాల చుట్టు పక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేశారు.



వికారాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థినులు

**రంగారెడ్డి జిల్లాలో 68,190 మంది హాజరు**

షాబాద్, ఫిబ్రవరి 29: రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ద్వితీయ ఏడాది తొలి పరీక్ష సజావుగా జరిగింది. గురువారం జిల్లా వ్యాప్తంగా తెలుగు పరీక్షకు 69,171 మంది విద్యార్థులకు గాను 68,190 మంది హాజరు కాగా 981 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 195 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా జిల్లాలో నాలుగు ఫ్లయింగ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నిమిషం నిబంధన ఉన్న నేపథ్యంలో విద్యార్థులందరూ కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు.

## ప్రతి ఆదివారం.. పరిష్కార వేదిక

- వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : బల్దియాలో ఆస్తిపన్నుపై ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఆదివారం 30 సర్కిల్ కార్యాలయాల్లో 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' వేదికలను నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ నెల 3, 10, 17, 24, 31వ తేదీల్లో ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార కార్యక్రమం కొనసాగుతుందని.. వినియోగదారులు అసెస్‌మెంట్లలో లోపాలతోపాటు ఇతరత్రా సమస్యలను పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు.